క్లుప్తంగా

నేడు తగ్గువారిపల్లెలో గడపగడపకు..

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయినగర్‌లో ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అగ్నిగుండ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ దేవి

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో ద్రౌపదీ అమ్మవారి తిరునాళ్లలో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ద్రౌపదీ దేవిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంత్ర భక్తులు అగ్ని గుడం ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వేగంగా గ్యాస్‌పైప్ పూడిక పనులు


బైపాస్‌లో జరుగుతున్న పనులు

నగరి: ఇంటింటికీ గ్యాస్ సరఫరాలో భాగంగా గ్యాస్‌పైపుల పూడిక పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరి బైపాస్ రోడ్డులో ప్రస్తుతం గ్యాస్‌పైపుల అమరిక పనులు జరుగుతోంది. పైపుల పూడిక పనులు ఇంకా 15 కిలోమీటర్ల మేర తిరుత్తణి వరకు జరగాల్సి ఉంది. అక్కడ ఏర్పాటు చేసే ఫిల్లింగ్ స్టేషన్ వరకు పూడిక పనులు పూర్తయితే పైపుల ఏర్పాటు పనులు పూర్తయినట్లే అని లేబర్ కాంట్రాక్టర్ తెలిపారు.

వైభవంగా సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహా సుదర్శన హోమ పూజలు చేశారు. ఉదయం స్వామివార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాత్తుమురై, ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టీ కేఎస్ శ్రీధర్, వాసు ఆధ్వర్యంలో అర్చకులు విష్ణుస్వామి, గోవింద స్వామి, శేషాద్రిస్వామి, ద్వివేది వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సుదర్శన హోమం, పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరిగింది.

పోషకాల గోరుముద్ద

- రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- వారంలో మూడు రోజులు రాగి జావా
- మెనూ ప్రకారం వంటకాలు
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు


కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో రాగి జావ తీసుకుంటూ..


కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో భోజనం తీసుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్‌ల నివారణతో పాటు పిల్లలకు పౌష్టికాహార అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని తీసుకొచ్చింది. అయితే గతంలో నిర్వహణ, పర్యవేక్షణ, చిత్తశుద్ధి లోపం కారణంగా విద్యార్థులకు సరైన ఆహారం అందేది కాదు. దీంతో పథకం నిర్వహణ గందరగోళంగా మారడమే కాకుండా లక్ష్యం నెరవేరలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించింది. జగనన్న గోరుముద్ద కింద మధ్యాహ్న భోజనానికి కొత్తరూపు తీసుకొచ్చింది. రాగి జావ, గుడ్డు అందజేస్తుండడంతో విద్యార్థులకు పోషకాలు అందుతున్నాయి.

యాదమరి: వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. నాడు-నేడుతో పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దారు. మధ్యాహ్న భోజనం విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తే ఆరోగ్యకరమైన సమాజం లభిస్తుందని భావించారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వమే ఏటా రూ.కోట్లు వెచ్చించి జగనన్న గోరుముద్ద పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో చిన్నారులకు పోషక విలువలతో పాటు గుడ్డు, చిక్కి, రాగి జావ, కూరగాయాలు, ఆకు కూరలతో కూడిన ఆహారాన్ని మరింత రుచికంగా అందజేస్తున్నారు. గతంలో వారంలో మూడు రోజులు మాత్రమే గుడ్డు ఇచ్చేవారు. జగనన్న వచ్చిన తరువాత రోజూ ఉడికించిన గుడ్డు ఇస్తున్నారు.

నియోజకవర్గంలో 19,392 మంది విద్యార్థులకు..

పూతలపట్టు నియోజకవర్గంలోని పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల తవణంపల్లె మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 381 ఉన్నాయి. వీటిలో 19,392 మంది విద్యార్థులకు నిత్యం జగనన్న గోరుముద్ద పథకం కింద రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా చలాకీగా చదువుకుంటున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పథకం అమలు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు 100 గ్రాములు, 6 నుంచి 10వ తరగతి వరకు 150 గ్రాముల అన్నం. వంట ఏజెన్సీలకు మెనూ ప్రకారం వడ్డించేందుకు గుడ్డు సరఫరా, ఆకు కూరగాయల నిమిత్తం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ. 5.87, ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థికి రూ.8.58 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇలా విద్యార్థులకు వంట వండేందుకు ఏజెన్సీలకు ఒక్కొక్కరికి నెలకు ప్రభుత్వం రూ.3 వేలు వేతనం అందజేస్తుంది.

బలానికి రాగి జావ

చదువుకునే పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి రాగి జావను అందిస్తోంది. వారంలో మూడు రోజుల పాటు (మంగళ, గురు, శనివారాలలో) రాగి జావా ఇస్తున్నారు. పాఠశాలకు వచ్చిన వెంటనే ఉదయం 9 గంటలకే గ్లాసులో రాగి జావా అందిస్తున్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం పాఠశాలలకు రాగిపిండి, బెల్లం సరఫరా చేస్తోంది.

జగనన్న గోరుముద్ద మెనూ

సోమవారం	-వెజ్ పలావు, గుడ్డు, కూర, చిక్కి
మంగళవారం	-పులిహోర, దొండకాయ, చెట్నీ, గుడ్డు
బుధవారం	-వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కి
గురువారం	-లెమన్ రైస్, టమోటా, చెట్నీ, గుడ్డు
శుక్రవారం	-అన్నం, పప్పు, ఆకుకూర, గుడ్డు, చిక్కి
శనివారం	-ఆకుకూరతో తయారు చేసిన అన్నం, స్వీట్ పొంగల్

మండలాల వారీగా విద్యార్థులు

మండలం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం	పిల్లలు
యాదమరి	54	10	07	71	4036
బంగారుపాళ్యం	80	05	12	97	5900
తవణంపల్లె	66	06	06	78	2844
ఐరాల	54	04	07	65	3180
పూతలపట్టు	52	07	11	70	3432
మొత్తం	306	32	43	381	19,392

మధ్యాహ్న భోజనం చాలా బాగుంది



పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చాలా బాగుంది. రోజు అన్నం, గుడ్డు, చిక్కి, ఇస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడు చాలా బాగుంటోంది. పాఠశాలలో కుర్చీలు టేబుళ్లు, విశాలమైన గదులు ఆడుకునేందుకు స్థలం, గోడలపై అందమైన పెద్ద బొమ్మలు వేశారు.
-తమన్నా, ఐదో తరగతి విద్యార్థిని, కాశిరాళ్ల

రాగి జావా ఇస్తున్నారు



వారంలో మూడు రోజులు రాగి జావాను పాఠశాలకు వచ్చిన వెంటనే ప్రార్థన చేసిన తర్వాత ఇస్తున్నారు. ఇష్టంగా తాగుతున్నాం. రాగి జావాతో పాటు చిక్కి, గుడ్డు, ఆకుకూర పప్పు పెడుతున్నారు. రుచికరంగా ఉంటుంది.
-ముజీబ్, పదో తరగతి, ఐరాల

గోరుముద్ద పకడ్బందీగా అమలు చేస్తున్నాం



జగనన్న గోరుముద్దను పకడ్బందీగా అమలు జరిగేలా చూస్తున్నాం. పాఠశాలకు వచ్చిన వెంటనే వారంలో మూడు రోజులు ఉదయం 9 గంటలకు రాగి జావ అందిస్తున్నాం. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు చేసేలా ప్రధానోపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్‌లకు సూచనలు ఇచ్చాం. ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీలు చేస్తున్నాం. భోజనం సరిగ్గా లేకపోతే మార్పులు చేయిస్తున్నాం.
-రుక్మిణీ, ఎంఈఓ, యాదమరి

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

పలమనేరు: పెన్షనర్ల ఐదు ప్రధాన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యదర్శి గురు రాజారావు అధ్యక్షతన సభ్యులు ముఖ్యమంత్రికి పోస్టుకార్డులను పంపారు. ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్ అందేలా చూడాలన్నారు. పెండింగ్ డీఆర్ బకాయిలను, పీఆర్‌సీని చెల్లించాలన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. సంఘం నాయ కులు కృష్ణమూర్తి, లక్ష్మీనరసింహులు, గురుసామినాయుడు, బాల సుబ్రమణ్యం, సాంబయ్య, నారాయణ పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


భీమ, దుర్యోధన పాత్రధారుల యుద్ధ సన్నివేశం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం భాగవతారణి జ్యోత్స్న దుర్యోధనవధ ఘట్టాన్ని హరికథ రూపంలో గానం చేశారు. అనంతరం వేంకటేశ్వర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో భీమ, దుర్యోధన పాత్రధారులు యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడు యుద్ధం అనంతరం మడుగులో దాక్కొని ఉండగా భీముడు అతనని బయటకు రప్పించి, శ్రీకృష్ణుని సాయంతో అంతమొందించే సన్నివేశాలను పాత్రధారులు పద్యాలతో రక్తి కట్టించారు. వారు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. దుర్యోధనుని ప్రతిమ మట్టికోసం భక్తులు ఎగబడ్డారు. తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అంతకు ముందు ఆలయంలో కంకణధారులైన పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి దంపతులతో పాటు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, నాగభూషణంరెడ్డి, గణేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నేడు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలోని వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల నడుమ స్పందన నిర్వహిస్తారని, ఆయా డివిజన్ల ప్రజలు అక్కడి సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్: 98499 07885 కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తమ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిత్తూరు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాపై అవగాహన కల్పిస్తున్న హరి

నగరి: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు హరి గురూజీ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని సరస్వతి విద్యామందిర్‌లో యోగా శిక్షణను ప్రారంభించారు. యోగా మెళకువలను నేర్పారు. యోగసాధన చేసే సమయంలో తీసుకోవాల్సిన ఆహార నియమాలను సూచించారు. నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆర్యోగం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా రిసోర్స్ పర్సన్‌లు ఎల్లప్పరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

17న అమావాస్య కూటం

పుత్తూరు రూరల్: స్థానిక ద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈనెల 17వ తేదీ అమావాస్య కూటం(సమీక్ష) నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా శ్రావణ మాసంలో పది రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించనున్నారు. ఉభయదారులు, గ్రామ పెద్దలు పాల్గొని తగిన సహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

గణనాథుని సేవలో ప్రముఖులు


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ వెంకటేశు


ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ పాటిల్, శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వేర్వురుగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ వెంకటేశు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవ రెడ్డి, ఐరాల తహసీల్దార్ సుశీల, టీటీడీ బోర్డు సభ్యుడు మురం రాముల శెట్టి పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివ

పుంగనూరు: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వారిచే స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ, అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 60 మందికి చికిత్సలు చేశారు. వీరిలో 20 మందిని ఐఓఎల్ ఆపరేషకు ఎంపిక చేసినట్లు డాక్టర్ శివ తెలిపారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఆపరేషన్లు చేసి, ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. క్లబ్ ప్రతినిధులు శ్రీరాములు, రజియా, సతీష్‌కుమార్‌రాజు, రఘునాథరెడ్డి, గోపాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో ఊహించని అభివృద్ధి


ఆలయం వద్ద మిత్రులతో హాస్యనటుడు సుదర్శన్

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందని సినీ హాస్య నటుడు సుదర్శన్ తెలిపారు. ఆదివారం స్నేహితుల బృందంతో కలసి ఆయన బోయకొండక వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందించారు. సుదర్శన్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు ఫలించడంతో మొక్కు చెల్లించేందుకు వచ్చినట్లు తెలిపారు. మహాశక్తి స్వరూపిణి అమ్మవారు భక్తుల పాలిట కొంగు బంగారంగా విరజిల్లుతున్నారని పేర్కొన్నారు. పదేళ్ల తర్వాత బోయకొండకు వచ్చానని ప్రస్తుతం అభివృద్ధి ఊహించని విధంగా ఉందని తెలిపారు. బోయకొండను పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సేవలు అమోఘమని పేర్కొన్నారు.

ఆహ్లాదం.. నగర వనం

- జిల్లాలో చిత్తూరు, పలమనేరులో నిర్మాణ పనులు
- కుప్పం, కార్వేటినగరంలో అనుమతులు మంజూరు



చిత్తూరులో సిద్ధమవుతున్న ఆర్చీ, పిల్లల పార్కు, వాకింగ్ ట్రాక్

నానాటికీ నగరం, పట్టణాల్లో పెరిగిపోతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. వాతావరణంలో కర్బన ఉద్గారాల శాతం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించే దిశగా నగర వనాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తోంది. విశాలమైన ప్రాంతం పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, చుట్టూ అడవి, ప్రవేశ ఆర్చీలతో నగరవన ప్రాంతాన్ని సుందరంగా నిర్మిస్తున్నారు. జిల్లాలో నిర్మిస్తున్న నగర వనాలపై కథనం.

చిత్తూరు కార్పొరేషన్: పచ్చదనం పెంపు, ప్రజలకు వినోదం, ఉల్లాసం, ఆరోగ్యం- కాన్సెప్ట్‌తో నగర వనాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉపక్రమించింది. చిత్తూరులోని ఆర్వీఎస్ నగర్ వద్ద, పలమనేరు, నగరవనాల పనులకు పూనుకుంది. అలాగే జిల్లాలోని జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. పర్యాటకులకు ఆకట్టుకునే విధంగా ఈ వనాల్లో వసతులు కల్పించడంతో పాటు సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

నగరవన యోజన పథకం

జిల్లాలో జనావాసాలకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వనాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి హెక్టార్‌కు రూ.4 లక్షల చొప్పున నిధులు ఇవ్వనున్నారు. చిత్తూరు నగరవనానిన 50 హెక్టార్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు విడుదల చేశారు. అక్కడ రూ.11.66 లక్షలతో 2 బోర్లు వేసి, మోటార్ ఏర్పాటు చే, నీటి వసతి కల్పించారు. ఆర్చి, ఫెన్సింగ్, ఇతర అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు వ్యయం చేశారు. నర్సరీలో పూలమొక్కలు, షో మొక్కల కోసం రూ.20 లక్షలు వెచ్చించారు. పిల్లల కోసం జారుడు బండ, ఉయ్యాల ఇలా మొత్తం 12 ఆట వస్తువులకు రూ.18 లక్షలు, పార్కుకు నీటి సరఫరా పైపులైన్, ఇతర పనులకు రూ.8 లక్షలు, వాకింగ్ ప్రాంతం ఏర్పాటుకు రూ.8.48 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.1.06 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన సదుపాయాలు కల్లిపంచి, మరో మూడు నెలల్లో నగర వనాన్ని ప్రారంభించాలనే ధ్యేయంతో పనులు చేస్తున్నారు. అలాగే పలమనేరులో 20 హెక్టార్లలో వనం నిర్మాణ పనులు చేస్తున్నారు. అక్కడ కూడా బోరు వేసి నీటి వసతి కల్పించారు. వీటితో పాటు పిల్లల పార్కు, రాశివనం, వాకింగ్‌ట్రాక్, నర్సరీ ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.20 లక్షలు ఖర్చు పెట్టారు.


పలమనేరు నగరవనాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి

మరో రెండు ప్రాంతాల్లో ..

కుప్పం, కార్వేటినగరంలో వనాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.40 కోట్లు కేటాయించింది. ప్రతి నగరవనంలో వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్నిఇచ్చే మొక్కలు, రచ్చబండ తరహాలో బెంచీలు, టాయిలెట్లు, లైటింగ్, ఆర్చ్, ఆర్వో ప్లాంట్, పార్కింగ్ ఏరియా, పిల్లలకు ఆటవస్తువులు సమకూర్చనున్నారు.

ప్రకృతి ఒడిలో రిలాక్స్



జిల్లాలో నగరవనాల ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తోంది. కుటుంబ సభ్యులతో ప్రకతి ఒడిలో సేద దీరేందుకు వీటిని నిర్మిస్తున్నాం. చిత్తూరు, పలమనేరులో పనులు జరుగుతున్నాయి. కార్వేటినగరం, కుప్పంలో వనాల ఏర్పాటు ప్రణాళిక రూపొందిస్తున్నాం.
-చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్ఓ

వాకర్స్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామిరెడ్డి

పుత్తూరు రూరల్: పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సేవలు అభినందనీయమని నగరి మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అదనపు భవన నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. అసోసియేషన్‌ను ప్రారంభించి, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఒక సంఘం విజయవంతంగా నడుస్తుంటే దాని వెనక పటిష్టమైన నాయకత్వమే కారణమన్నారు. ఆ నాయకత్వ పాత్రను డాక్టర్ సమర్థవంతంగా పోషిస్తున్నారని కొనియాడారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నడవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. తాను ఏడాది పాటు పుత్తూరులో పని చేశానని, అవకాశం వస్తే పుత్తూరు ప్రజలకు మళ్లీ సేవలందిస్తానని చెప్పారు. సంఘ నాయకులు డాక్టర్ రవిరాజు, గుణశేఖర్‌రెడ్డి, గోపికృష్ణ, మురగేష్‌రెడ్డి, రామచంద్రనాయుడు, యుగంధర్‌రాజు, కుప్పయ్యశెట్టి, వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర హైకోర్టు జడ్జి రవీంద్ర బాబు, ఉడిపి పుతిగే మఠం పీఠాధిపతి సుగేంద్ర తీర్థ స్వామీజీ వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు.